అది మరీ చిన్నదీ, అంత పెద్దదీ కాని ఒక బట్టల దుకాణం.

పట్టణంలో చాలా రద్దీగా ఉండే బజార్లలో కాకుండా, ఒక కాలనీ వంటి ఇళ్ల మధ్యనున్నది ఆ దుకాణం. రాత్రులు కాస్త త్వరగా అంగడి మూసివేయటానికి కారణం కూడా అదే కావచ్చు.

రాత్రి ఎనిమిది గంటలు అవటానికొక పది నిముషాలు తక్కువగా ఉంటుందేమో! అంటే 'శ్రీ హనుమాన్ క్లాత్ స్టోర్స్' మూయటానికి పది నిముషాలు టయిం ఉందన్న మాట. పనివాళ్ళందర్నీ పంపించేసి, యజమాని రామదాసు ఒక్కడే కూర్చుని ఉన్నాడు.

గల్లాపెట్టె ముందు కూచుని తల వంచుకుని లెక్కలు చూసుకుంటున్నాడు రామదాసు. బయట షోకేసు అద్దాల అవతల ఎవరో నిలుచుని ఉన్నట్లు అనిపించి తల ఎత్తి చూశాడు.

ఎవరయినా చీరలు కొనవచ్చిన కస్టమర్ ఏమో అని చూసిన రామదాసు ఆశ్చర్యపోయాడు. అక్కడ చూస్తూ నిలుచుని ఉన్నదొక పాప. వయసు ఎనిమిది సంవత్సరాలుంటాయేమో.

పెద్దకథ

# మాతృ హృదయం

— 'వింధ్యవాసిని'

రామదాసుకు పెళ్ళి అయి ఆరు సంవత్సరాలు అయినా పిల్లలు లేరు. అందుకని ఎవరి పిల్లలయినా సరే, చిన్న పిల్లలు కనిపిస్తే దగ్గరకి పిలిచి ముద్దు చేస్తాడు.

బయట నిలబడి ఉన్న అమ్మాయిని లోపలికి రమ్మని పిలిచాడు. ఆ పిల్ల లోపలికి వస్తూ ఉండగా, ముఖం చూస్తే బాగా పరిచయం ఉన్నట్లు తోచింది రామదాసుకు. ఎవరివో తనకు చాలా ఆత్మీయుల పోలికలు ఆ పాపలో కనిపిస్తున్నాయి.

బెదురు కళ్ళతో చుట్టూ చూస్తూ, లోపలికి నడిచొచ్చింది. ఆ పాపను తన పక్కనే కూచోబెట్టుకుని, "నీ పేరేమమ్మా?" అని అడిగాడు రామదాసు.

"జ్వాల" అని ముద్దుగా చెప్పింది పాప.

రామదాసెందుకో ఉలిక్కిపడ్డాడు. 'జ్వాల' అన్న పేరు వినగానే, అతని మనసు అట్టడుగున దాగి ఉన్న మరో పేరు గుర్తొస్తుంది. ఆ ముద్దు ముఖంలో పోలికలు ఎవరివో తెలిసీ తెలియనట్లుగా ఉంది.

"ఆ అద్దాల్లో ఉన్న బొమ్మకు కట్టిన చీర ఎంతవుతుందండీ?" జ్వాల ప్రశ్న రామదాసును, ఆలోచనల్లోంచి బయటికి తీసుకొచ్చింది.

"నీకెందుకు పాపా చీరె? నువ్వు కట్టుకోవు గద!" నవ్వుతూ అడిగాడు రామదాసు.

"కాదండీ మా అమ్మకు కావాలి. మా అమ్మ అంటే నాకు చాలా ఇష్టం. తన దగ్గరేం ఉన్నా నాకు ఇస్తుంది. ఎప్పుడూ నాకే ఏదో ఒకటి కొని ఇస్తుంది. తనకు మాత్రం కట్టుకోను మంచి చీర ఒక్కటయినా లేదు. అల్లదిగో ఆ బూడిదరంగు చీర ఉందే, ఆ రంగంటే మా అమ్మకు భలే ఇష్టం. అందుకని నేనే ఈ చీర కొని మా అమ్మకిస్తే చాలా సంతోషిస్తుంది. కదండీ!"

రామదాసు కళ్ళు తడి అవుతున్నాయి.

"అవునమ్మా. తప్పకుండా సంతోషిస్తుంది. ఇదిగో అట్లాంటిదే ఈ కవర్లో ఉంది. పాక్ చేసి ఇస్తాను" అని లేచాడు రామదాసు.

"మరి అది...దాని ఖరీదు ఎంతవుతుందో!"

చిన్నపిల్ల. ఆమె దగ్గర చీర ఖరీదుకు సరిపడేంత డబ్బు ఉంటుందన్న నమ్మకం లేదు. రామదాసుకెందుకో 'జ్వాల'ను నిరుత్సాహపరచకూడదనిపించింది. కళ్ళు పెద్దవిగా చేసి తన వయిపే చూస్తున్న ఆ అమ్మాయి, ఏవేవో జ్ఞాపకాలను వెనక్కు తీసుకొచ్చి, రామదాసు బుర్రను పనిచేయనివ్వటం లేదు.

"నీ దగ్గరెంతుంది?"

"ఏమో తెలీదండీ! ఇదిగో లెక్కపెట్టాలి" అంటూ, మోకాళ్ళదాకా ఉన్న గౌను జేబులోంచి

పెద్దకథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

చిల్లర నాణాలు మూట కట్టిన చేతి గుడ్డను బయటికి తీసింది జ్వాల.

ఇద్దరూ కలిసి లెక్క పెట్టారు, పదహైదు రూపాయల అయిదు పైసలుంది. "చీర వెల పదహైదేనమ్మా" అంటూ అయిదు పైసలు వెనక్కిచ్చి, చీర పాకెట్టు చేతికిచ్చి జ్వాలను పంపించాడు రామదాసు. సంతోషంతో వెలిగిపోయిన పాప ముఖం రామదాసుకు నష్టాన్ని గుర్తురాకుండా చేసింది. ఆతనికి సంతృప్తిగా వుంది, సంతోషంగా వుంది. ఈ జ్వాలకు, ఒకానొకప్పుడు తన ప్రాణానికి ప్రాణం అయి, మనసులో మనసుగా నిలిచిన జయకు ఏమయినా సంబంధం వుందా?

నవ్వుకున్నాడు తనలో తనే. అసలు జయ బ్రతికి వుందన్న నమ్మకమే లేదు అతనికి. బ్రతికి ఉంటే, ఇన్నేళ్ళు తనకు చేరకుండా వుండదు ఆమె.

గల్లాపెట్టె తాళం వేసి, బట్టలు వరుసలుగా పేర్చి వున్న బీరువాల అద్దాల తలుపులన్నీ లాగి బిగించాడు రామదాసు. ఇంటికి పోవటానికి తయారయి, బయటికి వచ్చి తలుపులు మూయబోయాడు.

సరిగ్గా అప్పుడే తలకు ముసుగు వేసుకుని వున్న ఒక ఆడమనిషెవరో వచ్చి నిలుచుంది. ఆమె చేతిలో, రామదాసు కొన్ని నిముషాల క్రితం జ్వాల కిచ్చిన చీరె పాకెట్టు వుంది.


"ఎవరమ్మా? ఏం కావాలి?" అడిగాడు రామదాసు.

"ఈ చీరె ఎంతవుతుందో నాకు తెలీదు. అంత ఇచ్చుకునే స్థితి కూడా కాదు. దయచేసి ఇది వెనక్కు తీసుకోండి బాబూ" అంటున్న ఆమె వయిపు చూస్తున్న రామదాసు - "మీ పాప దానిధర ఇచ్చే తీసుకుపోయిందే! వూరికే ఎందుకిస్తాను? అంత మంచి బిడ్డను కన్న మీరు అదృష్టవంతులు. వెళ్ళి రండి" అంటూ తన పాటికి తను తలుపులు బిగిస్తూ ఉండిపోయాడు.

"అలా వద్దండీ. పోనీ ఖరీదయినా చెప్పండి. వాయిదాల్లో కట్టుకుంటాను."

రామదాసు తలుపులు బిగించి తాళం పెట్టటం అయింది. వెనక్కు తిరిగాడు. అప్పుడే అటు వెళ్ళిన ఏదో వాహనపులైట్ల వెలుతురు ఆమె ముఖం మీద పడింది. అవాక్కై నిలుచుండి పోయాడు రామదాసు.

"జయా! నువ్వు .... నువ్వేనా? ఇన్నేళ్ళు ఏమయినావు?" ఆత్రుతగా అడిగాడు.



చేష్టలు దక్కి, వయసు తెచ్చిన మార్పులతో హుందాగా కనిపిస్తున్న రామదాసు వయిపు చూస్తూ నిలబడిపోయిన జయ తేరుకుని, "రండి మాట్లాడుకుందాం. మా ఇల్లు దగ్గరే" అని అడుగు ముందుకేసింది.

అల్యూమినియం ప్లేటులో పప్పు అన్నం కలుపుకుని తింటూ, గడప దగ్గరే కూచుని, అమ్మ కోసం చూస్తూ వుంది జ్వాల.

అంత దూరంలో వస్తున్న అమ్మ వెంబడి, వెనకాలే నడుస్తున్న బట్టల అంగడి ఆయన్ను చూసి ఆశ్చర్యపోయింది జ్వాల.

దగ్గరికి వచ్చిన వెంటనే, "అమ్మా ఈయన్నీకు తెలుసా?"

"అవునమ్మా. బాగా తెలుసు. మా వూరే."

"మన చుట్టాలా?"

"అవునమ్మా. చుట్టాలే చిన్నాన్న అని పిలువు నన్ను సరేనా?"

"జ్వాలకు కొండెక్కినంత సంతోషంగా వుంది. ఆమె పుట్టి బుద్ధి తెలిసిన తర్వాత చుట్టంగా వచ్చిన మొదటి వ్యక్తి ఇతనే.

ఆ ఒంటి గది ఇంటినీ, అక్కడున్న సామానులనీ, పైన సగందాకా చెదలు తినేసిన వాసాలనీ చూస్తూ అక్కడున్న ఒకే చెక్క స్టూలు మీద కూర్చున్నాడు రామదాసు. అతనికి ఎన్నో ప్రశ్నలు అడగాలని వుంది. జ్వాల ఎదురుగా, జయతో ఏవిధంగా మాట్లాడాలో అర్థం కాకుండా వుంది. అందుకని మౌనం వహించి కూర్చున్నాడు. జరుగుతుంది కలా నిజమా అని ఇంకా అనుమానంగా వుంది అతనికి.

గోడమీద ఒక మూలగా ఫోటో ఒకటి వేలాడుతూంది.

"ఆయన జ్వాల నాన్నగారా?" అడిగాడు రామదాసు.

జయ జవాబివ్వలేదు. చాప పరిచి, పాపను పడుకోబెట్టి, జోకొడుతూ కూచుంది.

"మీరు బావున్నారా? మీ భార్య...."

"మాకేం లక్షణంగా ఉన్నాము. నా భార్య ఉత్తమ ఇల్లాలు" అని అతను గర్వంగా అంటే జయ మనసు కలుక్కుమంది.

కానీ ఆ తర్వాత అతను, "పిల్లలు లేరు. అదొక్కటే లోటు, కనిపించిన రాళ్ళు, రప్పలన్నిటికీ పూజలు చేస్తుంటుంది నా భార్య" అన్నప్పుడు, జయ మనసుకయిన నొప్పి కాస్త తగ్గింది. ఆమెకు రామదాసును చూస్తుంటే అసూయగా వుంది.

ఒకానొకప్పుడు నాణెంలో బొమ్మా బొరుసంత చేరువగా, ఒకరిమీద ఒకరు ఆధారపడి వుండిన వాళ్ళు తనూ, రామదాసు. అతని జీవితంలో ఏ ఒడిదుడుకులూ లేవు. తను....తన బ్రతుకు....బ్రతికి వున్నది కాబట్టి బ్రతుకుగా మిగిలింది. పట్టపగ్గాలు లేని సంతోషాన్నీ చూసింది; కళ్ళు తెరిచే ఉన్నా దృష్టికి ఏదీ ఆనని కారుచీకటినీ, ఆ చీకటిని భరించలేని ఒంటరితనాన్నీ, కన్నీళ్ళనీ తనివితీరా రుచి చూసింది. కోరిన కొండ మీది వస్తువును కొని తెచ్చుకోగల ఐశ్వర్యాన్ని అనుభవించింది; ఆకలికి ఆగలేక మంచినీళ్ళతో కడుపు నింపుకుని దినాలు గడపటమూ తెలుసు.

జ్వాల నిద్రపోయిన చాలా సేపటి తర్వాత, రామదాసు ముందు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చింది జయ.

"ఆ ఫోటోలో వున్నది నాకు తాళి కట్టిన పుణ్యాత్ముడు" అన్నది.

"అంటే..."

"అవును జ్వాల ఆయన కూతురు కాదు"

"మరి...."

"జ్వాల నీ కూతురే" అని చెబితే అతనెంత ఆనందిస్తాడో జయకు తెలుసు. అంత సంతోషాన్ని తను అతని కెందుకివ్వాలి? అతని వల్ల తను పడిన కష్టాలకు ప్రతిఫలంగానా?

ఏమో! చిత్రంగా అతను కనిపించనన్ని రోజులూ పెంచుకున్న కోపం అంతా ఎటో పోయింది. అతన్ని ఎదురుగా కళ్ళారా చూస్తుంటే మళ్ళీ అతని అమాయకత్వం, తనంటే ప్రాణం ఇచ్చిన ప్రేమ అన్నీ గుర్తొచ్చి మనసును ప్రసన్నం చేస్తున్నాయి. నిజానికి అతను మాత్రం చేసిందేముంది? అంతా తన ఖర్మ. పరిస్థితుల ప్రభావం. అప్పుడు అతనికా ప్రాణాల మీదికి తెచ్చిన విషజ్వరం వచ్చి, తనకు దూరంగా తమ వూరు విడిచే వెళ్ళిపోవటం వల్ల తన బ్రతుకిలా అయింది. అప్పట్లో ఆ అవరోధమే గనుక ఏర్పడక పోతే.... అతని అండ తనకు దొరకకుండా చేసే శక్తి ఎవరికీ లేదు.

రామదాసు ఇల్లు చేరేటప్పటికి బాగా ప్రొద్దుపోయింది. అతని భార్య జానకి ఆదుర్దాగా ఎదురు చూస్తోంది.

"అబ్బ నాకెంత భయమయిందో ఇంతాలస్యమయిందేం?'. అంటూ రామదాసు భుజానున్న కండువా అందుకుంది జానకి.

రామదాసు ఇంత వరకూ భార్యతో ఎప్పుడూ అబద్ద మాడింది లేదు. అతని కలాంటి అవసరమే రాలేదు. తమ పెళ్ళికి ముందర, తనకు జయతో ఉన్న స్నేహాన్ని గురించి కూడా దాచుకోకుండా ఆమెకు ఎప్పుడో చెప్పేశాడు.

"అదొక పెద్ద కథ. ముందు అన్నం తిందాము రా. తర్వాత చెప్తాను" అన్నాడు బట్టలు మార్చుకుంటూ.

భోజనం ముగించి, పక్కే మంచం మీద ఆలోచిస్తూ పడుకున్నాడు రామదాసు.

తాంబూలం తీసుకుని వచ్చి మంచం మీద కూర్చుని, 'ఇప్పుడు చెప్పండి' అన్నట్లు చూసింది జానకి.

"జయ ఈ వూర్లోనే వుంది జానకీ!" అన్నాడు మరే ఉపోద్ఘాతం లేకుండానే.

జయను గురించి తమ పెళ్ళి అయిన మొదట్లో భర్త చెప్పినదంతా, జానకికి గుర్తుంది. ఆమె ఇంకేమీ అడగలేదు. మౌనంగా వింటూ కూర్చుంది.

"నాకు ఆరోగ్యం సరిపడి తిరిగి వచ్చేసరికి, జయ మాయం అయిందని చెప్పాను కదూ! ఆమె ఇంట్లో అడిగితే, చచ్చిపోయిందని కోపంగా చెప్పి నా ముఖం మీదే తలుపులు మూశారు. వూర్లో తలొక మాట అన్నారు. ఒకరు వూరు విడిచి ఎటో వెళ్ళి పోయిందన్నారు. రైలు క్రింద పడి చచ్చిపోయిందని ఇంకొకరన్నారు. మొత్తానికి నిజం మాత్రం తెలియలేదు.

"నాకు తెలీని నిజం ఇంకొకటుంది జానకీ.... ఆమెకు దూరంగా నేను పోయినప్పటికి ఆమె గర్భవతి. ఆ కారణంగా ఇంట్లో వాళ్ళు బయటికి తరిమేశారు. కష్టం చెప్పుకునేందుకు మనిషి గానీ, సహాయం చేసే తోడుగానీ లేక పాపం జయ ఎన్ని కష్టాలు పడిందీ, ఆమె నోటే విని భరించలేక పోయాను నేను.

"మందులేని హృద్రోగంతో బాధపడుతున్న ఒక ఆగర్భ శ్రీమంతుడు, జయ పరిస్థితి గమనించి, ఈమెను పెళ్ళి చేసుకున్నాడు. అందుకు ప్రతిగా అతను చనిపోయేదాకా, అతన్ని అంటిపెట్టుకుని వుండి సేవలు చేసింది తను. అతను

పోయిన తర్వాత ఇంట్లో చేరిన చుట్టాలు, జయను గురించిన వివరాలు అన్నీ లాగారు. ఆమెకు, ఆయనతో పెళ్ళి అయిన తేదీ, పాప 'జ్వాల' పుట్టిన తేదీ లెక్కవేసి, ఆ పిల్ల ఆయన సంతానం కాదని తేల్చారు. ఫలితంగా జయ బ్రతుకు మళ్ళీ బజార్లో పడింది. అప్పటినుంచీ ఈ వూరొచ్చి ఇక్కడే కాలం గడుపుతూ ఉన్నదట. పాత కుట్టు మిషనొకటి ఉంచుకుని, బట్టలు కుట్టి, తిండి, బట్ట జరుపుకుంటున్నది. అమ్మాయి 'జ్వాల' ఎంత ముద్దుగా ఉందో తెలుసా? అసలు వాళ్ళీ వూర్లో ఉన్నారని ఎట్లా కనుక్కున్నానో నీకు చెప్పనే లేదు కదూ?'' అంటూ ఆరోజు సాయంత్రం జ్వాల తన దుకాణం దగ్గరికి రావటం మొదలు జరిగిందంతా చెప్పుకొచ్చాడు రామదాసు.

"మీరు చెపుతుంటే, ఆ పాపను ఇప్పుడే చూద్దామా అనిపిస్తుందండి. రేపు మన ఇంటికి తీసుకుని రారూ?''

"తప్పకుండా జానకీ!....నీకు జయ మీద కోపం లేదు కదూ....?''

"ఛ! కోపం ఎందుకు? దురదృష్టవంతురాలు ఆమె. ఇప్పటినుంచీ జ్వాలకు అమ్మలు ఇద్దరు అని చెబితే నమ్ముతారా?''

"ఒక్క విషయం మరిచాను జానకీ. జ్వాలకి విషయాలేవీ తెలియవు. నేను తనకు చిన్నాన్న అవుతానని చెప్పాను. చిన్నతనంలోనే మరొక వ్యక్తిని తండ్రిగా ఎరిగిన ఆ పిల్ల ఈ నిజాన్ని జీర్ణించుకోవటం సాధ్యం కాదనిపిస్తుంది. నువ్వూ అంతే, సరేనా?''

"మీరన్నది నిజమేనండి. పడుకుందాం. పొద్దుపోయింది.''

*

జానకి, రామదాసులకు సంతానం లేని లోటు తీరింది.

రోజుకు ఒక్కసారయినా జ్వాల రామదాసు ఇంటికి రాకుండా ఉండదు. పిన్నమ్మను చూడకుండా, ఆమె తన కోసం దాచి ఉంచే చిరుతిండి తినకుండా, జ్వాల మనసు ఆగదు. అయితే ఆమె మనసుకు అంతగా నచ్చని విషయం ఒకటుంది. పిన్నమ్మను తమ ఇంటికి రమ్మని ఎన్నిసార్లు పిలిచినా ఆమె రాదు. పోనీ అమ్మయినా చిన్నాన్న ఇంటికి వస్తుందా అంటే, 'అది తప్ప ఇంకేదయినా అడుగు, చేస్తాను' అంటుంది. ఈ మొండితనం జ్వాలకు అర్థం కాదు. రామదాసు మాత్రం అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడు.

జ్వాల చాలావరకు అతన్ని దుకాణంలోనే కలుసుకునేది.

కొంచెం మెరుగ్గా ఉన్న రెండు గదుల ఇంటికి జయ మకాం మారింది. రామదాసు దగ్గరుండి ఇల్లు మార్పించాడు. జయ మొదటి మాదిరే బట్టలు కుడుతోంది. కానీ రామదాసు సహాయం కూడా కొంత ఉండటంవల్ల, ఆమె ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. ఎప్పుడూ దిగులుగా కనిపిస్తూ ఉండిన అమ్మ ముఖంలో అప్పుడప్పుడు చిరునవ్వులు కనిపించడం జ్వాలకీ సంతోషంగానే వుంది. రామదాసు వెంట ఎప్పుడయినా స్కూలుకూ, సాయంత్రాలు మార్కెట్‌కో, షికారుకో పోయినప్పుడు, గర్వంగా అనిపించేది. ఒకప్పుడు తండ్రుల వెంట కనిపించే తన తోటి పిల్లలను చూస్తే బాధ, అసూయ కలిగేవి. ఇప్పుడు ఎవర్నీ పట్టించుకోదు. కీ ఇచ్చిన బొమ్మలా కదులుతూ, కబుర్లు చెప్తూ రామదాసు వెంబడి, అతని చిటికిన వేలు పుచ్చుకుని నడుస్తుంది.

రామదాసు బట్టల అంగడిలో పనిచేసే నలుగురు కుర్రవాళ్ళతో, ఒక్క రోజులోనే పరిచయం చేసుకుని, వాళ్ళకు మంచి స్నేహితురాలయింది జ్వాల.

అమ్మాయి ఎవరని అడిగిన వాళ్ళకంతా "మా బంధువులే మా అన్నయ్యగారి కూతురు.'' అని చెప్పుకొచ్చాడు రామదాసు.

జ్వాలను బాగా చదివించాలని అనిపించేది రామదాసుకు "పెద్దయ్యాక ఏమవుతావు తల్లీ?'' అని తను అడిగినప్పుడంతా, "డాక్టరవుతాను, చిన్నాన్నా'' అని ఆమె జవాబిస్తే మురిసిపోయేవాడు.

జయ ఇంట్లో, జయతో జ్వాలతో గడపినంతసేపు రామదాసుకు పది సంవత్సరాల క్రిందటి గతానికి ప్రస్తుతానికీ మధ్య ఏదీ జరగనట్లే వుండేది.

"జ్వాల'' అన్న పేరు రామదాసుకు చాలా ఇష్టం. జయను పెళ్ళి చేసుకుని సుఖ సంసారం సాగిస్తానని కలలు కంటున్న రోజుల్లో, తను మొదటి సంతానం అమ్మాయే అయితే జ్వాల అని పేరు పెట్టాలని ఎన్నోసార్లు అనుకునేవాడు అతను. ఇలాంటి కబుర్లు ఎన్నో జ్వాలకు చెప్పాలనిపించేది. జయ చూపులు అతన్ని కట్టి పడేసేవి. దాంతో మాట తప్పించడం తప్పేది కాదు.

పట్టుదలగా చదివి పియూసీ మంచి మార్కులతో పాసయింది జ్వాల.

ఎం. బి. బి. ఎస్. లో సీటు వచ్చింది.

చదువుకోసం జ్వాల వూరు వదలి వెళ్ళాలి సొచ్చింది.

అమ్మను వదిలి వెళ్ళటం అదే మొదలేమో, ఏడుపు వచ్చేసింది జ్వాలకు.

జయ స్థితీ అంతే, ఏడుస్తూ బిడ్డను పంపడం మంచిది కాదని, బలవంతాన కన్నీళ్ళు ఆపుకుని పంపించింది.

"ఎవరికోసం సంపాదించాలి?'' అన్న ఒకప్పటి నిరాసక్తత ఇప్పుడు రామదాసులో లేదు. జ్వాలను చదివించాలి. మంచి వరుణ్ణి చూసి, ఘనంగా చదివించాలి, అటు తర్వాత ఆమెకేలోటూ కలుగకుండా ఇల్లు కట్టివ్వటం మొదలు అన్నీ అమర్చి పెట్టాలి. ఇలా సాగేవి ఆలోచనలు. హెచ్చుగా డబ్బు మదుపు పెట్టి వ్యాపారాన్ని అభివృద్ధి చేశాడు, మెయిన్ బజార్లో ఇంకొక పెద్ద అంగడి తెరిచాడు. ఈ మధ్య ఎక్కువకాలం అక్కడే గడుపుతున్నాడు. జ్వాలకు మాత్రం తను ముందుగా అతన్ని కలుకున్న చిన్న దుకాణం అందులో పని చేసే వాళ్ళలో మిగిలి వున్న ఇద్దరు వ్యక్తులు అంటే ఇష్టం. సెలవుల్లో వచ్చినప్పుడల్లా అక్కడే తనకు కావలసిన చీరెలు ఎన్నుకునేది. ఆ అంగడి వరండాలో మిషన్ పెట్టుకుని కూర్చునే సాయిబు తాతతో జాకెట్లు కుట్టించుకునేది.

జయ కూలికి బట్టలు కుట్టటం మానేసి, కుట్టు సెంటర్ ఒకటి ప్రారంభించింది. దాని మూలంగానే జ్వాల లేని లోటును కూడా మరచిపోగలిగింది. రోజుకు కనీసం యాభయి మంది నాలుగయిదు బాచ్‌లుగా వచ్చి జయ దగ్గర కుట్టు నేర్చుకుంటారు. మెడిసిన్ మొదటి సంవత్సరం పరీక్షలు వ్రాసే ముందు కాస్త పట్టుదలగా పగలు రాత్రి చదివిందేమో జ్వరం వచ్చేసింది జ్వాలకు. హాస్టల్ వార్డన్ టెలిగ్రాం ఇచ్చి జయను పిలిపించారు.

కూతుర్ని దగ్గరుండి చూసుకుంటూ, జ్వాలకు పరీక్షలు అన్నీ అయ్యేదాకా జయ అక్కడే వుండిపోయింది. థియరీ పరీక్షలు అయిన వారం రోజుల తర్వాత ప్రాక్టికల్ పరీక్షలున్నాయి. కూతురు అవి కూడా ముగించుకుని వస్తుందిలెమ్మని జయ ప్రయాణం అయింది. [సశేషం]